సాక్షి కర్నూలు

మంగళవారం, 9, మే, 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం విశాఖపట్టణానికి చెందిన బి.శివరావు రూ.1,11,116 విరాళంగా అందజేశారు.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను మండపంలో ఉంచి వెయ్యి దీపాలను వెలిగించారు.



మెరుపు తీగ.. యమపాశమై !

జిల్లాలో సోమవారం వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది. 8లో▸

న్యూస్‌రీల్

జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి జిల్లాలో అర్హులైన మైనారిటీ విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్.సబీహా పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ దేశాల్లో టాప్ మోస్ట్ 200 యూనివర్సిటీల్లో వారి అర్హతలకు అనుగుణంగా విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఇందుకు జిల్లాలోని మైనారిటీ విద్యార్థులు(ముస్లిం/ దూదేకుల/ క్రిష్టియన్ (బీసీ -సీ)/సిక్కులు/జైనులు/బౌద్దులు/జోరాష్టియన్లు(పార్శీకులు) hhps://jnanabhumi.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9160903300 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉత్తీర్ణత శాతం పెరగాలి



రెమిడియల్ తరగతులను పరిశీలిస్తున్న జేడీ వెంకట కృష్ణారెడ్డి

పాణ్యం: ప్రతి జూనియర్ కళాశాల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని జేడీ వెంకట కృష్ణారెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న రెమిడియల్ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెయిల్, ఇంప్రూమెంట్ రాస్తున్న విద్యార్థులకు రెమిడియల్ తరగతులు ఎంతో ఉపయోగమన్నారు. విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల వారీగా సులభతర పద్ధతిలో బోధన చేయాలని అధ్యాపకులను ఆదేశించారు. తరగతులకు రాని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి వారు కచ్చితంగా హాజరయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ దినేష్‌బాబు, వీరేష్, తదితరులు ఉన్నారు.

పాలిసెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ఏపీ పాలిసెట్-2023 పరీక్షను ఈనెల 10వ తేదీన నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని పరీక్షల సమన్వయాధికారి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలోని 21 కేంద్రాల్లో 7,240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు చెప్పారు. 10వ తేదీ ఉదయం 10 నుంచి 1 గంట మధ్య పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, గాడ్జెట్లను అనుమతించొద్దని సూచించారు. కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు రుణాల పంపిణీ



రామచంద్రరావు, ఎల్‌డీఎం, కర్నూలు

కర్నూలు(అగ్రికల్చర్): రైతులు, స్వయం సహాయక సంఘాలు, ఇతర అన్ని వర్గాల వారికి లక్ష్యం మేరకు బ్యాంకుల ద్వారా రుణాల పంపిణీకి కృషి చేస్తానని కర్నూలు జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) రామచంద్రరావు తెలిపారు. సోమవారం ఎల్‌డీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే 2023-24 వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ ద్వారా విడుదల చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఓ విద్యార్థి..ఇదిగో పుస్తకం!

విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు, నాలుగు నెలలు గడిచినా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల చేతిలో పాఠ్యపుస్తకాలు ఉండవు. దీంతో ఏం చదువుకోవాలో తెలియక వారు.. ఏం చేయాలో తెలియక ఉపాధ్యాయులు సతమతమయ్యేవారు. ఇదంతా 2019కి ముందు. ఇప్పుడు స్కూళ్లు తెరిచిన తొలిరోజే పాఠ్యపుస్తకాలు ఇస్తున్నారు. పిల్లల విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో 2023-24 విద్యా సంవత్సరం పుస్తకాలు సైతం ముందుగానే జిల్లాకు చేరుతున్నాయి.

- జిల్లాలో 2,92,957 మంది విద్యార్థులు
- 57.72 లక్షల పాఠ్య పుస్తకాలు అవసరమని ఇండెంట్ పెట్టిన అధికారులు
- ఇప్పటికే జిల్లాకు చేరిన 21.52 లక్షల పుస్తకాలు
- మొదటి స్పెల్‌లో మండల కేంద్రాలకు 15.22 లక్షల పాఠ్య పుస్తకాల పంపిణీ
- 9వ తరగతికి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు
- జగనన్న కానుకల్లోని వస్తువులు సైతం జిల్లాకు చేరిక



గోదాములో ఉన్న పాఠ్యపుస్తకాలు



పుస్తకాలను మండల కేంద్రాలకు తరలిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ముఖ్యంగా పేద విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా పలు చర్యలు తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదని పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు, సాక్సులు, టై, యూనిఫాం, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, బ్యాగు ఉచితంగా అందిస్తున్నారు. 'జగనన్న విద్యాకానుక' పేరుతో అమలు చేస్తున్న ఈ పథకం దేశంలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించడమే కాక పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. విద్యా సంస్కరణల్లో భాగంగా సర్కారు ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం చదువును ప్రవేశపెట్టి ఆంగ్లంతో పాటు తెలుగులో పుస్తకాలు ముద్రించి ఇస్తోంది.

ఉమ్మడి జిల్లాకు 57.72 లక్షల పుస్తకాలు

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్, కస్తూరిబా పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూళ్లు మొత్తం 1,493 ఉన్నాయి. ఈ స్కూళ్లలో 2,92,957 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ అన్ని రకాల పాఠ్య పుస్తకాలు కలిపి 57.72 లక్షలు అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారులు ఇండెంట్ పెట్టారు. సుమారుగా 21.52 లక్షల పాఠ్య పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరాయి. ఈ పుస్తకాలను ప్రస్తుతం మండల కేంద్రాలకు చేర్చే ప్రక్రియ చేపట్టారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 9వ తరగతి సిలబస్‌లో మార్పులు చేశారు. ఈఏడాది నుంచి ఎన్‌సీఈఆర్‌టీ స్థాయి పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందించనున్నారు. గతేడాది నుంచే 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలను అందజేస్తున్నారు. భవిష్యత్తులో ఉన్నత పాఠశాలలో ఉన్నటువంటి పేద విద్యార్థులు జాతీయస్థాయిలో జరిగే వివిధ పోటీ పరీక్షల్లో రాణించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అన్ని సౌకర్యాలు ఉన్న స్కూళ్లను సీబీఎస్‌సీ సిలబస్ అమలు చేసేందుకు ఎంపిక చేసింది.

2.92 లక్షల మందికి విద్యా కానుక కిట్లు...

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో మొత్తం 1,493 స్కూళ్లు ఉన్నాయి. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 2,92,957 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేయనున్నారు. గతంలో ఒక్కో విద్యార్థికి విద్యా సంవత్సరం ప్రారంభం తర్వాత రెండు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మూడు జతల యూనిఫాం, బ్యాగు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, ఇంగ్లిషు-తెలుగు పిక్టోరియల్ డిక్షనరీలు, నోట్స్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పెద్ద బ్యాగు, 200 పేజీల వైట్ లాంగ్ నోట్ బుక్స్ 3, రూల్డ్ లాంగ్ బుక్స్ 4, బ్రాడ్ రూల్డ్ (గీతలు) 1, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఇస్తున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెద్ద సైజు బ్యాగు, నోటు బుక్స్, బూట్లు, సాక్సులు, అదనంగా మరో రెండు నోటు బుక్స్ ఇస్తారు. కానుకల్లోని వస్తువులన్నింటినీ కలిపి కిట్ల రూపంలో ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలకు జూన్ 10వ తేదీ నాటికి వాటిని చేర్చనున్నారు.

పాఠశాలల పునఃప్రారంభం రోజే పంపిణీ



జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 57.72 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా, మొదటి స్పెల్‌లో జిల్లాలో గతేడాది మిగిలి ప్రస్తుతం వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నటువంటి పుస్తకాలతో కలిపి మొత్తం 21.52 లక్షలు జిల్లాకు వచ్చాయి. వీటిలో మండల కేంద్రాలకు 15.22 లక్షల పుస్తకాలు చేర్చాం. వీటితో పాటు జగనన్న విద్యాకానుక కిట్లను సైతం మండల కేంద్రాల నుంచి స్కూల్ పాయింట్లకు చేర్చుతున్నారు. అన్ని వస్తువులను కిట్ రూపంలో తయారు చేసి పాఠశాలల పునఃప్రారంభం రోజు పంపిణీ చేస్తాం. – వి.రంగారెడ్డి, డీఈఓ,కర్నూలు

విధుల్లో చేరిన దిశ మహిళా పీఎస్ డీఎస్పీ



ఎస్పీకి బొకే అందజేస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

కర్నూలు: కర్నూలు దిశ మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా నియమితులైన ఐ.సుధాకర్‌రెడ్డి సోమవారం విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా తిరుపతి స్పెషల్ బ్రాంచ్ విభాగం నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన ఈయన 1995లో ఎస్ఐ హోదాలో పోలీసు శాఖలో చేరి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో పనిచేశారు. 2007లో సీఐగా పదోన్నతి పొంది ఆళ్లగడ్డ సర్కిల్‌లో విధులు నిర్వహించారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొంది కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో విధులు నిర్వహించి గత నెల 26వ తేదీన మొదటి విడత జరిగిన బదిలీల్లో భాగంగా తిరుపతి స్పెషల్ బ్రాంచ్ విభాగానికి వెళ్లారు. తాజాగా కర్నూలుకు వచ్చిన ఆయన ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

స్టాఫ్ అసిస్టెంట్ పోస్టుల ఎంపిక జాబితా విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదలైంది. 18 స్టాఫ్ అసిస్టెంటు పోస్టుల భర్తీకి జిల్లా సహకార కేంద్రబ్యాంకు గత ఏడాది నవంబరు నెలలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో పరీక్ష తర్వాత ఒక పోస్టుకు ముగ్గురు ప్రకారం పిలిచి ఇంటర్వ్యూలు చేశారు. ఇందులో ఎంపికైన వారి వివరాల జాబితాను డీసీసీబీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు అధికారులు సోమవారం ప్రకటించారు. 18 మందిలో ముగ్గురిని పీఏసీఎస్‌ల నుంచి తీసుకోగా.. 15 మందిని ఓపెన్ మార్కెట్ నుంచి తీసుకుంటున్నారు. వెబ్‌సైట్ అడ్రస్ www.kurnooldccb.com సందర్శించాలని సూచించారు. నియామక పత్రాలను పోస్టల్ అడ్రస్‌కు పంపుతామని డీసీసీబీ సీఈఓ పి.రామాంజనేయులు తెలిపారు.



రైతే రాజు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతే రాజు అని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే ఎద్దులబండిపై ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యమిది - ఆదోని అర్బన్

రోజుకు రెండుసార్లు స్పందన పోర్టల్ పరిశీలించాలి

- ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు
- జిల్లా కలెక్టర్ సృజన



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌డాక్టర్ జి.సృజన, జేసీ ఎస్.మౌర్య తదితరులు

కర్నూలు(సెంట్రల్): జిల్లా అధికారులు ప్రతి రోజూ రెండుసార్లు స్పందన పోర్టల్‌ను ఓపెన్ చేసి పరిశీలించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. కొన్ని శాఖల అధికారులు పోర్టల్‌ను ఓపెన్ చేయకపోవడంతో ఏమి సమస్యలు వచ్చాయో కూడా వారికి తెలియడం లేదన్నారు. ఈ నిర్లక్ష్యాన్ని వీడకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జేసీ నారపురెడ్డి మౌర్య, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ..జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పోలీసు శాఖ నిర్లక్ష్యంగా ఉందన్నారు. కనీసం వచ్చిన అర్జీలను ఓపెన్ చేసి చూడడంలేదన్నారు. ప్రస్తుతం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఈజ్ ఆఫ్ లివింగ్ సర్వేలు జరుగుతుండడంతో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనిపై అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేయాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రమణారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, రమ, నాగప్రసన్నలక్ష్మి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు.

లోకేష్... దమ్ముంటే నిరూపించు!

- ఆరోపణలపై సవాల్ విసిరిన ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్
- ఖురాన్ పట్టుకుని లోకేష్‌కు ఎదురెళ్లిన వైనం
- కర్నూలులో రెండుగంటల పాటు హైటెన్షన్



రెండో పట్టణ పోలీసు స్టేషన్ వద్ద మెట్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): 'పవిత్ర మసీదులు, దర్గాల ఆస్తులు నేను కబ్జా చేసినట్లు నువ్వు ఆరోపించావు. అల్లాను నమ్మిన నేను అలాంటి పని చేయను. ఖురాన్‌పై ప్రమాణం చేస్తా! దమ్ముంటే నువ్వు నాపై చేసిన ఆరోపణలు నిరూపించాలి లేదంటే క్షమాపణ చెప్పాల'ని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్.. టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌కు సవాల్ విసిరారు. యువగళం పాదయాత్రలో లోకేష్ తనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ ఎమ్మెల్యే సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తర్వాత ఆరోపణలు రుజువు చేయాలని లోకేష్‌ను కోరేందుకు ఉదయం 9:45 గంటలకు ఇంటి నుంచి పవిత్ర గ్రంథం ఖురాన్ పట్టుకుని ద్విచక్ర వాహనంపై పాతబస్తీలోని ఖూబ్‌సూరత్ మసీదుకు చేరుకున్నారు. అక్కడ మసీదులో నమాజ్ చదివి ఖురాన్ పఠనం చేశారు. పాదయాత్రలో లోకేష్‌ను ప్రశ్నించేందుకు ఎమ్మెల్యే వచ్చారని తెలుసుకున్న నగర కార్పొరేటర్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరు మసీదుకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12:50 గంటలకు మసీదు నుంచి బయటకు వచ్చిన ఎమ్మెల్యే.. లోకేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన యాత్రకు ఎదురెళ్లారు. దీంతో స్థానిక పాతబస్తీలోని మాసుంబాషా దర్గా ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇరు పార్టీల నాయకుల మధ్య తోపులాట జరిగింది. వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడికి యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకునే యత్నం చేయగా ఆయన నేలపై కూర్చున్నారు. తర్వాత ఆయనను పోలీసులు వాహనంలో తరలిస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. దమ్ముంటే అబద్దాల లోకేష్ బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే మీసం మెలేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో చివరకు పోలీసులు ఎమ్మెల్యేను రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లగా అక్కడ స్టేషన్ మెట్లపై కూర్చొని నిరసన తెలిపారు. అరగంట తరువాత ఎమ్మెల్యేను ఆయన ఇంటికి తీసుకెళ్లి పోలీసులు గృహ నిర్బంధం చేశారు. నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్లు షాషావలి, జుబేర్, యూనుస్, రాజేశ్వరరెడ్డి, కృష్ణకాంత్, పార్టీ నాయకులు ఖాదర్‌బాషా, హకీమ్, ఇర్ఫాన్, ఖాజా, అక్బర్, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



కర్నూలు(లీగల్): కర్నూలులో హైకోర్టు ఏర్పాటును అడ్డుకుంటే టీడీపీకి భవిష్యత్తులో పుట్టగతులుండవని కర్నూలు న్యాయవాదులు హెచ్చరించారు. సోమవారం ఉదయం జిల్లా కోర్టు నుంచి స్థానిక వైఎస్సార్ సర్కిల్ వరకు న్యాయవాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి లోకేష్ పాదయాత్రలో నిరసన తెలిపారు. రెండు రోజుల క్రితం లోకేష్ తాము అధికారంలోకి వస్తే కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తామని చెప్పడాన్ని న్యాయవాదులు తప్పుబట్టారు. యువ న్యాయవాదులతో పాటు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నేతలు సువర్ణారెడ్డి, ప్రభాకర్, పుల్లారెడ్డి, సంపత్‌కుమారి, రవీంద్రరెడ్డి, కృష్ణమూర్తి, జగదీష్, రాజేష్, రామకృష్ణ, బాలరంగస్వామి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక గుమ్మజ్ వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు సీహెచ్ మద్దయ్యను పోలీసులు దౌర్జన్యంగా తీసుకెళ్లారు.

మొక్కజొన్నకు మద్దతు

- రైతులు నష్టపోకుండా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలుకు శ్రీకారం
- కర్నూలు జిల్లాలో 15, నంద్యాల జిల్లాలో మరో 15 కేంద్రాలు ఏర్పాటు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 74 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- దిగుబడులు సగటున 30 క్వింటాళ్లపైనే
- మద్దతు ధరతో నంద్యాల జిల్లాల్లో ప్రారంభమైన కొనుగోళ్లు
- నేటి నుంచి కర్నూలు జిల్లాలో మొదలు



రబీలో పండించిన మొక్కజొన్న పంట

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2022-23 రబీలో పండించిన పంటల్లో ప్రధానమైనది మొక్కజొన్న. అయితే, ఈ పంటకు మార్కెట్‌లో ధర పూర్తిగా పడిపోయింది. దీనిని సాకుగా చూపి దళారులు మరింత తక్కువ ధరకు మొక్కజొన్నను కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రైతుల కష్టార్జితం దళారీల పాలు కాకుండా మద్దతు ధరతో కొనుగోలుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపింది. ఇప్పటికే ఆ సంస్థ నంద్యాల జిల్లాల్లో మొక్కజొన్న కొనుగోలు ప్రారంభించగా కర్నూలు జిల్లాలో మంగళవారం నుంచి మొదలు పెట్టనుంది. కర్నూలు జిల్లాలో 15, నంద్యాల జిల్లాలో 15 ప్రకారం కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసింది.

దళారులు ఇస్తున్న ధర రూ.1500 వరకే...

మొక్కజొన్న పంటకు మద్దతు ధర రూ.1962 ఉంది. మొక్కజొన్న పంట కొనుగోలులో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్నకు కనిష్టంగా రూ.1,469, గరిష్టంగా రూ.1,869 ప్రకారం ధరలు లభిస్తున్నాయి. దళారీలు రైతుల నుంచి రూ.1500 ధరతోనే కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. క్వింటాలుపై రైతులు రూ.462 వరకు నష్టపోతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం వారిని ఆదుకోవడానికి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి జిల్లాలో 74 వేల ఎకరాల్లో సాగు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2022-23 రబీలో దాదాపు 74 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. కర్నూలు జిల్లాలో 27 వేల ఎకరాలు, నంద్యాల జిల్లాలో 48 వేల ఎకరాల్లో సాగు చేశారు. హెక్టారుకు 25 క్వింటాళ్ల నుంచి 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కొద్ది రోజులుగా మొక్కజొన్నను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ఆర్‌బీకే ఇన్‌చార్జీలను సంప్రదించి సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 300 మంది, నంద్యాల జిల్లాలో 450 మంది రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది.

నాణ్యత ఇలా ఉండాలి..

మద్దతు ధర రూ.1,962 పొందాలంటే మొక్కజొన్న తగిన నాణ్యతతో ఉండాలి. తేమ 14 శాతం, ఇతర వ్యర్థ పదార్థాలు 1 శాతం, ఇతర పంట గింజలు 3 శాతం, దెబ్బతిన్న గింజలు 1.5 శాతం, పాక్షికంగా రంగుమారినవి, విరిగిన ధాన్యపు గింజలు 4.5 శాతం, ముతక/ పూర్తిగా తయారు కాని ధాన్యపు గింజలు 4 శాతం, పురుగు పట్టిన గింజలు 1 శాతం వరకే ఉండాల్సి ఉంది. ఈ నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న మొక్కజొన్నకే మద్దతు ధర వర్తిస్తుందని మార్క్‌ఫెడ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎకరాకు 26 క్వింటాళ్ల వరకు మద్దతు ధరతో కొనుగోలు చేస్తారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు హర్షనీయం



రబీలో పండించిన మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవడం శుభపరిణామం. దళారీలు రూ.1500 నుంచి రూ.1600 వరకు మాత్రమే అడుగుతున్నారు. వారికి అమ్ముకుంటే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. మేము 10 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాము.ఎకరాకు సగటున 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది.

– ఎస్.శివపుల్లారెడ్డి, నెరవాడ గ్రామం,పాణ్యం మండలం

దళారులకు అమ్ముకొని నష్టపోవద్దు



రబీలో పండించిన మొక్కజొన్న పంటను రైతులు దళారులకు అమ్ముకొని నష్టపోవద్దు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. మద్దతు ధర రూ.1,962 ఇస్తున్నాం. ఈ ధరతో అమ్ముకునేందుకు ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు వెంటనే ఆర్‌బీకేల్లో పేర్లను నమోదు చేసుకోవాలి. కొనుగోలు చేసిన రెండు వారాల్లోపు రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తాము.

– నాగరాజు, జిల్లా మేనేజర్, మార్క్‌ఫెడ్, నంద్యాల

అపోలో ఫార్మసీలో చోరీ

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అపోలో ఫార్మసీలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సోమవారం ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని వ్యక్తులు ఫార్మసీ డోర్ తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. క్యాష్‌బాక్స్‌లోని రూ.70వేల నగదు ఎత్తుకెళ్లారు. ఫార్మసీ ఫార్మసిస్ట్ శ్రీరాముల సుందరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మెరుపు తీగ యమపాశమై..



- పిడుగుపాటుతో జిల్లాలో ముగ్గురు మృత్యువాత
- మరో నలుగురికి గాయాలు

పిడుగులు ప్రాణాలు తీస్తున్నాయి. మెరుపు తీగలు యమపాశాలై కాటేస్తున్నాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు పిడుగుపాటుకు గురై మృత్యువాత పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. ఈ సమయంలో పలు చోట్ల పిడుగులు పడ్డాయి. సమీపంలో ఉన్న ముగ్గురు వ్యక్తులు పిడుగు శబ్దానికి షాక్ గురై మృతి చెందారు. మృతుల్లో రైతు, మహిళ కూలీ, ఇంటర్ విద్యార్థి ఉన్నారు. ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

కొనుగోలు చేసిన ఎద్దులను ఇంటికి చేర్చకుండానే..



మృతిచెందిన నౌసేపాటి (ఫైల్)

ఆలూరు రూరల్: తాను రెండెకరాల రైతు. వ్యవసాయంలో మరింత రాణించాలని, జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని ఆలోచించాడు. ఎద్దులను కొనుగోలు చేసి గ్రామంలో ఇతరుల పొలాలకు బాడుగ వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు సంతకు వెళ్లి ఎద్దులను కొనుగోలు తిరిగి వస్తుండగా పిడుగుపాటుకు గురై మృత్యువాత పడ్డాడు. ఆలూరు మండలం మొలగవల్లిలో ఈ విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోపిని నౌసేపాటి (38), భార్య భూ లక్ష్మి ఇద్దరు కలసి సోమవారం పత్తికొండ సంతకు వెళ్లారు. అక్కడ జత ఎద్దులను కొనుగోలు చేసి మధ్యాహ్నం ట్రాలీ ఆటోలో బయలుదేరారు. ఆటోలో లోపల భూలక్ష్మి, డ్రైవర్, మరొకరు ఉండగా, ట్రాలీలో ఎద్దులను ఎక్కించాడు. వాటిని చూసుకునేందుకు నౌసేపాటి ఆటో క్యాబిన్‌పై ఎక్కి కూర్చున్నాడు. మొలగవల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని ఎర్రబండ వంక వద్ద వస్తుండగా పక్కనే పిడుగు పడింది. ఆటో టాప్‌పై కూర్చున నౌసేపాటి పిడుగు శబ్దానికి షాక్‌కు గురై ఆటో పైనే ప్రాణాలు వదిలాడు. వీపు భాగమంతా కాలిపోయింది. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డాక్టర్ నాయక్ తెలిపారు. నౌసేపాటి మృతి పట్ల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిన్న ఈరన్న, మొలగవల్లి జెడ్పీ స్కూల్ పీఎంసీ చైర్మన్ రామాంజినేయులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆరేళ్ల క్రితం తండ్రి.. ఇప్పుడు తల్లి

- అనాథలైన ముగ్గురు పిల్లలు



మృతి చెందిన లక్ష్మీదేవి

డోన్ టౌన్: చిన్న మల్కాపురం గ్రామంలో సోమవారం పిడుగుపాటుకు యర్రగుంట్ల గ్రామానికి చెందిన మహిళా కూలీ లక్ష్మీదేవి (35)మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. యర్రగుంట్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవితో పాటు పుణ్యవతి, అనిత, లక్ష్మి, ఖాసీం కూలీ పనుల నిమిత్తం చిన్నమల్కాపురం గ్రామ సమీపంలో పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం పొలంలోని ఒక చెట్టుకింద కూర్చొని భోజనం చేసి చేతులు కడుగుతున్న సమయంలో ఒక్క సారిగా మెరుపులు, ఉరుములతో వాన కురిసింది. ఈ సమయంలో పక్కనే పిడుగు పడటంతో లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. మరో నలుగురు గాయపడగా చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆరేళ్ల క్రితం లక్ష్మీదేవి భర్త బోయ కిట్టు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి లక్ష్మీదేవి కూలీ పనులకు వెళ్తూ ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని పోషిస్తోంది. పిడుగుపాటుతో తల్లి మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. పిల్లలు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మీదేవి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోయిలకొండ నాగరాజు, నక్కిశ్రీకాంత్, రామాంజనేయులు కోరారు.

తల్లిదండ్రులకు చేదోడుగా వచ్చి..

- పిడుగుపాటుతో యువకుడి మృతి
- ప్రాణాలతో బయటపడిన మృతుని తల్లి



పిడుగుపాటుకు మృతి చెందిన ఆవుల విష్ణు



ప్రాణాలతో బయటపడిన మృతుని తల్లి లక్ష్మి

పగిద్యాల: జీవాలను మేపుకుంటూ వలస వచ్చిన తల్లిదండ్రులకు చేదోడుగా వచ్చిన ఓ యువకుడు పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. సోమవారం సాయంత్రం పగిద్యాల - కొణిదేల రహదారి మధ్య పొలాల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం తూముకుంట బొల్లవరం గ్రామానికి చెందిన కురువ ఆవుల నాగేంద్ర, అతని భార్య లక్ష్మి దాదాపు పది నెలల క్రితం జీవాలు మేపుకోవడానికి పగిద్యాల మండలానికి వలస వచ్చారు. ఇటీవల ఇంటర్ పరీక్షలు పూర్తి కావడంతో వారి కుమారుడు ఆవుల విష్ణు(18) కూడా వారి వద్దకు చేరుకున్నాడు. ప్రతి రోజు జీవాలను మేపుకుని, రాత్రి వేళ ఒప్పందం ఉన్నా పొలాల్లో మందను నిలిపేవారు. ఈ క్రమంలో కొణిదేల గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో మందను నిలిపారు. సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండటంతో పొలంలో ఉన్న వేప చెట్టు కిందకు విష్ణు పరుగెత్తాడు. ఇంతలోనే చెట్టుపై పిడుగు పడడంతో యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ ప్రమాదంలో మృతుని వద్ద ఉండే ఆండ్రాయిడ్ సెల్ పేలి గుండె ఉండే ప్రాంతంలో గాయాలు కావడంతో హఠాన్మరణం చెందినట్లు తెలుస్తోంది. చెట్టుకు కొద్ది దూరంలో ఉన్న మృతుని తల్లి లక్ష్మి ప్రాణాలతో బయటపడింది. సమాచారం అందుకున్న ముచ్చుమర్రి హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వీఆర్వో నాగన్న పంచనామా నిర్వహించగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేతికొచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నేటి నుంచి 'జగనన్నకు చెబుదాం' ప్రారంభం

- ప్రజలు స్వచ్ఛందంగా 1902 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో భాగంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం మంగళవారం నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని, ఏవైనా సమస్యలుంటే 1902కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పరిష్కరించేందుకు సీఎం కార్యాలయం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. సోమవారం సాయంత్రం ఆమె వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హౌసింగ్‌కు సంబంధించి స్టేజ్ కన్వర్షన్‌లో గూడూరు, సి. బెళగల్, చిప్పగిరి, కోడుమూరు, నందవరం మండలాలు వెనుకబడి ఉన్నాయని, పురోగతి చూపేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడును ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆదోని ప్రాంతంలో హార్టికల్చర్ సాగును ప్రోత్సహించాలన్నారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయాలని పీఆర్ ఇంజినీర్లను ఆదేశించారు. జేసీ ఎస్.మౌర్య మాట్లాడుతూ..ఓటీఎస్ పెండింగ్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్లను పరిశీలన చేసి శుక్రవారంలోపు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు



బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: వికలాంగుల కోటా కింద రైల్వే శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని కోడుమూరు పట్టణానికి చెందిన ఈశ్వరమ్మ ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సోమవారం ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 87 ఫిర్యాదులు వచ్చాయి.

ప్రభుత్వమే బతికించింది!

- ఇంఫాల్ నుంచి సురక్షితంగా సొంతూళ్లకు..



కోల్‌కతా విమానశ్రయంలో జిల్లా విద్యార్థులు

కర్నూలు(సెంట్రల్): ఉన్నత విద్య కోసం ఇంఫాల్ వెళ్లి అక్కడ అల్లర్లలో చిక్కుకున్న విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం క్షేమంగా సొంతూళ్లకు చేర్చింది. కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 11మంది విద్యార్థులు మణిపూర్‌లో అగ్రికల్చర్, ఎన్‌ఐటీ కోర్సుల్లో చదివేందుకు వెళ్లారు. అయితే ఇటీవల అక్కడ రెండు తెగల మధ్య చెలరేగిన గొడవలు హింసకు దారి తీయడంతో రాష్ట్రంలోని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారిని సొంతూళ్లకు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా 11 మందిలో ఇప్పటికే ఆరుగురు వారి స్వగ్రామాలకు చేరుకున్నారు. మిగిలిన ఐదుగురు కూడా కోల్‌కతా విమానశ్రాయంలో రాత్రి 11, 2 గంటలకు హైదరాబాద్ వచ్చే విమానాల్లో వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. కాగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరగా స్పందించి తమ పిల్లలను తీసుకొచ్చి అప్పగించడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షేమంగా ఇంటికి చేర్చారు

నేను మణిపూర్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతున్నా. అక్కడ ఒక్కసారిగా అల్లర్లు చెలరేగడంతో భోజనానికి కూడా ఇబ్బంది అయింది. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కూడా ఏమీ చేయలేకపోయారు. చివరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి మమ్మల్ని స్వస్థలాలకు చేర్చారు. సాయంత్రం 6 గంటలకు నిడ్జూరులోని మా ఇంటికి చేరుకున్నాం. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.
– ప్రశాంత్‌రెడ్డి, నిడ్జూరు, కర్నూలు మండలం

తల్లిదండ్రులను చూస్తామనుకోలేదు

మణిపూర్‌లో చెలరేగిన అల్లర్లతో మళ్లీ మా అమ్మానాన్నలను చూస్తామనుకోలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నేరుగా మమ్మల్ని మా ఇంటి దగ్గరకే తీసుకొచ్చి వదిలిపెట్టింది. మధ్యాహ్నం 1.20 గంటలకు శంషాబాద్ వచ్చాం. అక్కడి నుంచి 6.40 గంటలకు ఇంటికి చేరుకున్నా. అక్కడ పరిస్థితులు చల్లబడే వరకు ఇక్కడే ఉండాల్సి వస్తుంది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం
– జి.సేలంరాజు, రెవెన్యూ కాలనీ, కర్నూలు

విషాదం

- ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ
- తల్లీ, కుమార్తె దుర్మరణం



సంఘటనల స్థలంలో మృతదేహాలు



కుమార్తె మానసతో తల్లి లక్ష్మి (ఫైల్)

బనగానపల్లె రూరల్: తల్లిదండ్రులను చూసేందుకు భర్తతో కలిసి బైక్‌పై వెళ్తున్న ఓ మహిళ బిడ్డతో సహా దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన బనగానపల్లె - ప్యాపిలి రహదారిలోని దద్దణాల సమీపంలో చోటు చేసుకుంది. బనగానపల్లె ఎస్‌ఐ రామిరెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ప్యాపిలి మండలం అలేబాద్ గ్రామానికి చెందిన ఎస్.మనోహర్, లక్ష్మి దంపతులకు కుమార్తె మానస (2) ఉంది. కాగా లక్ష్మి తల్లిదండ్రులు రాంపుల్లయ్య, రామేశ్వరి బనగానపల్లెలో ఉన్నారు. వారిని చూసేందుకు సోమవారం చిన్నారిని వెంట పెట్టుకుని దంపతులిద్దరూ బైక్‌పై బయల్దేరారు. మార్గమధ్యలో దద్దణాల సమీపంలో బనగానపల్లె నుంచి గుత్తికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ప్రమాదశాత్తూ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడిన లక్ష్మి, చిన్నారి మానసపై బస్సు టైర్లు వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మనోహర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రామిరెడ్డి వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా మృతుల కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్ వద్ద ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను తమకు అప్పగించాలని కొద్ది సేపు నిరసన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ చేరుకుని బాధితులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపారు. తల్లి, కూతురు ఒకేసారి ఇలా రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో బంధువు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు దాటుతుండగా..

- కారు ఢీకొని మహిళ మృతి



భార్య మృతి చెందడంతో రోదిస్తున్న భర్త నల్లన్న

కల్లూరు: రోడ్డు దాటుతుండగా కారు ఢీ కొని ఓ మహిళ మృతి చెందారు. ఈ సంఘటన 44వ జాతీయ రహదారి మయూరి గ్రీన్‌ల్యాండ్ దగ్గర చోటు చేసుకుంది. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు... పత్తికొండ టౌన్‌కు చెందిన ఎస్.నల్లన్న, లక్ష్మీదేవి (72)దంపతులు మయూరి గ్రీన్ ల్యాండ్‌లో నివాసిస్తున్న పెద్దకుమారుడి వద్ద ఉన్నారు. సోమవారం కంటి వైద్యం కోసం ఆ దంపతులు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. డాక్టర్ లేకపోవడంతో తిరిగి ఆటోలో బయలుదేరారు. మయూరి గ్రీన్ ల్యాండ్ వద్ద దిగ్గి రోడ్డు దాటుతుండగా కర్నూలు వైపు నుంచి బెంగళూరు వైపునకు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ఘటనలో లక్ష్మీదేవి తలకు, శరీరంపై బలమైన గాయలవడంతో అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలియగానే ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ హన్స్ రామ్ రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

క్లుప్తంగా

వరి పొలంలో మొసలి



ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని చెన్నాపురం గ్రామంలోని రైతు వెంకట్రాముడుకు చెందిన వరి పొలంలో సోమవారం సాయంత్రం మొసలి ప్రత్యక్షమైంది. వరి కోత కోస్తున్న కూలీలు మొసలిని చూసి భయంతో పరుగులు పెట్టారు. వరి పొలం సమీపంలో ఎల్ఎల్‌సీ కాలువ ఉండటంతో అందులో నుంచి పొలంలోకి వచ్చినట్లు తెలుస్తోంది.

పద్మశాలి విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థుల(10వ తరగతి, ఇంటర్‌లో మెరిట్)కు ప్రతిభ అవార్డులు అందించనున్నట్లు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు భీమనపల్లె వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతిలో 540, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు అవార్డులకు అర్హులన్నారు. మెరిట్ ఆధారంగా మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7,500, తృతీయ బహుమతిగా రూ.5 వేలు, కన్సోలేషన్ బహుమతులుగా రూ.2 వేలతో పాటు మెమొంటో, ప్రశంసా పత్రాలను అందిస్తామన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 11న ఉదయం 10.30 గంటలకు నంద్యాల సంజీవనగర్‌లోని శ్రీ భద్రావతి భావనారుషి దేవాలయ కళ్యాణ మండపంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తామన్నారు. వివరాలకు గాజుల శంకర్(9908541124), గాజుల బ్రహ్మయ్య(9701232676), వెంకటరామయ్య(9908386822), ఎం.మంగపతి (9390458889)ను సంప్రదించాలన్నారు.

వేసవిలో తరగతులు నిర్వహిస్తే చర్యలు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు వేసవిలో ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. అకడమిక్ ఇయర్ ప్రారంభం కాకుండానే ఇంటర్మీడియెట్ రెగ్యులర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే బీఐఈ ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించిన విద్యార్థులకు మాత్రమే రెమిడియల్ తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఎంసెట్, వివిధ ఎంట్రెన్స్ పరీక్షల పేరుతో ఎటువంటి క్లాసులు నిర్వహించకూడదని చెప్పారు.

11 నుంచి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 11వ తేదీ నుంచి ఉమ్మడి రాష్ట్రాల ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 11వ తేదీన పాలపండ్ల విభాగంలో నిర్వహించే రాతిదూలం లాగుడు పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వృషభరాజముల యజమానులకు రూ. 50వేలు, ద్వితీయ, తృతీయస్థానాల్లో రూ. 40వేలు, రూ. 30వేలు, తర్వాతి రెండుస్థానాల్లోని విజేతలకు రూ. 20వేలు, రూ. 10వేలు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అలాగే 13వ తేదీన న్యూ కేటగిరి విభాగంలో జరిపే ఎడ్ల బలప్రదర్శనలో మొదటి స్థానంలోని వృషభరాజముల యజమానులకు రూ. లక్ష, తర్వాతి స్థానాల్లో రూ. 80వేలు, రూ. 60 వేలు, రూ. 40 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. దాతల ఆర్థిక సహకారంతో బహుమతులు ప్రదానం చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వృషభరాజముల యజమానులు ఈ నెల 10వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9989376207ను సంప్రదించాలని వివరించారు.

హిజ్రా ఆత్మ హత్య



మృతుడు సాయి పల్లవి (ఫైల్)

డోన్ టౌన్: పట్టణంలోని త్రివర్ణ కాలనీలో నివాసం ఉంటున్న సాయిపల్లవి (సాయినాథ్‌రెడ్డి వయస్సు 21) అనే హిజ్రా ఆత్మహత్య చేసుకున్నారు. పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అవుకు మండలం జూనూతల గ్రామానికి చెందిన సాయినాథరెడ్డి నాలుగేళ్ల క్రితం హిజ్రాగా మారి డోన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పట్టణంలో నివసించేవారు. బంధువులు, కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటం, ఇంటికి వెళితే తనను నిరాకరిస్తారని మనస్తాపంతో సోమవారం తెల్లవారు జామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన తోటి హిజ్రాలు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సాయినాథ్‌రెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

క్లుప్తంగా

ప్రత్యేక శిక్షణకు వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): విజయవాడలో ఈ నెల 10, 11వ తేదీల్లో నిర్వహించనున్న వృత్తిపర శిక్షణకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్స్, ఏడీలు వెళ్లనున్నారు. వీరికి ఆసుపత్రి, కళాశాలల్లో పరిపాలనకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎలక్ట్రికల్ అంబులెన్స్‌ల సేవలు ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన అందజేసిన ఎలక్ట్రికల్ అంబులెన్స్‌లను సోమవారం నుంచి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగుల కోసం ఉపయోగించారు. ఈ ప్రక్రియను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అత్యవసర రోగులను క్యాజువాలిటీ నుంచి స్కానింగ్ కోసం, ఈసీజీలు, వైద్యపరీక్షల కోసం ఒకచోట నుంచి మరో చోటికి తీసుకుని వెళ్లేందుకు అంబులెన్స్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఏఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ రామశివనాయక్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ కిరణ్‌కుమార్,నర్సింగ్ సూపరింటెండెంట్-2 సావిత్రిబాయి పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరస్వామి భూములను కాపాడండి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని జొహరాపురం సమీపంలో ఉన్న నీలకంఠేశ్వరస్వామి భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరు తూ లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు బీజేపీ నేత హరీష్‌బాబు తెలిపారు. సోమవారం పూర్తి ఆధారాలను లోకాయుక్తకు అందజేసినట్లు చెప్పారు. స్వామి భూములను కాపాడాలని అధికారులను కోరినా పట్టించుకోకపోవడంతోనే లోకాయుక్తను ఆశ్రయించినట్లు ఆయన వివరించారు.

రైతులకు సరైన పరిహారం ఇవ్వాలి



ఆర్‌డీఓ హరిప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): చెన్నై-సూరత్ జాతీయ రహదారి కోసం భూములు ఇస్తున్న రైతులకు సరైన పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలు ఆర్‌డీఓ, తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చారు. అనంతరం బాధిత రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ధర్నాలో నాయకులు కృష్ణ, మాధవ రెడ్డి, వెంకటయ్య, రాఘవేంద్ర పాల్గొన్నారు.

'చిన్మయ ప్రభావళి' ప్రారంభం

కర్నూలు కల్చరల్: కర్నూలు వీఆర్ కాలనీలో చిన్మయ మిషన్ నూతన భవనం 'చిన్మయ ప్రభావళి'ని ప్రారంభించారు. సోమవారం వీఆర్ కాలనీలో మిషన్ కేంద్రంలో చిన్మయానంద మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గో పూజ, కలశ పూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం,గురుపాదుకా పూజలు నిర్వహించారు. చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సందేశమిచ్చారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. నిత్యం భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. కార్యక్రమంలో మిషన్ సభ్యులు గురవయ్య శెట్టి, రత్నప్రసాద్, శ్రీనివాస్, జగదీష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



చిన్నారులతో వీహెచ్‌పీ మాతృశక్తి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: వీహెచ్‌పీ - మాతృ శక్తి విభాగం ఆధ్వర్యంలో 1వ తేదీ నుంచి శరీన్ నగర్ సద్గురు త్యాగరాజ సీతారామాలయం కల్యాణ మండపంలో నిర్వహించి వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, వీహెచ్‌పీ మాతృ శక్తి జిల్లా కన్వీనర్ రాధిక మాట్లాడుతూ సనాతన హైందవ ధర్మాన్ని బోధించడానికే బాలలకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏ ధర్మమైనా చిరకాలం వర్ధిల్లాలంటే చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణా శిబిరంలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, నగర అధ్యక్షులు టీసీ మద్దిలేటి, నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు, మాతృ శక్తి నగర కన్వీనర్ భార్గవి, సభ్యులు ప్రవీణ్, రాజేశ్వరి, సహస్ర పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే ఊరొదిలిపోతా

- వక్ఫ్ ఆస్తులు ఆక్రమించలేదని ఖురాన్‌పై ప్రమాణం చేస్తా
- వాటి జోలికెళ్తే అల్లా క్షమించడని తెలుసు
- లోకేష్‌వి అసత్య ఆరోపణలు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): నారా లోకేష్ తనపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవడంతో పాటు ఊరు వదిలి పోతానని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు ఆక్రమించినట్లు లోకేష్ తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. ఈ విషయంలో పవిత్ర గ్రంథం ఖురాన్‌పై ప్రమాణం చేస్తానన్నారు. మసీదు, దర్గాల ఆస్తుల జోలికెళ్తే అల్లా క్షమించడని తెలుసని, అలాంటి తాను వాటిని ఎలా కబ్జా చేస్తానని ప్రశ్నించారు. ఆక్రమణలపై బహిరంగ చర్చకు రావాలని, లేకపోతే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఒక ముస్లిం ప్రజాప్రతినిధిగా వక్ఫ్ ఆస్తులను కాపాడేందుకు రెండు సార్లు వక్ఫ్ సీఈఓను కర్నూలుకు రప్పించానన్నారు. అయితే తమకు సంబంధించి రెండు మూడు కేసులు కోర్టులో ఉన్నాయని, అవి కబ్జాకు సంబంధించినవి కాదని, కేవలం టెనెంట్‌కు సంబంధినవే అన్నారు.

టీడీపీ హయాంలో ముస్లింలకు అన్యాయం

టీడీపీ హయాంలో ముస్లింలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. వేల ఎకరాలు కబ్జాచేసిన టీడీపీ నేతలపై ఎందుకు కేసులు పెట్టలేదన్నారు. 2014లో ముస్లింలకు ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదన్నారు. నంద్యాల ఉప ఎన్నికల సమయంలో అక్కడి టీడీపీ సీనియర్ నేత ఎన్‌ఎండీ ఫరూక్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి, సాధారణ ఎన్నికలు ఆరు నెలలు ఉన్న సమయంలో మంత్రి పదవి ఇస్తే ఘన కార్యమా అని ప్రశ్నించారు. మరో సీనియర్ నేత షరీఫ్‌ను సైతం అవమానించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. మహానేత 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ముస్లింల జీవితాల్లో వెలుగు నింపారని, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మసీదుల్లో నమాజ్ చేయించే ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాన్ని పెంచి మరింత మంచి చేశారని తెలిపారు.

జగనన్న ముస్లింల పక్షపాతి

ఎన్‌ఆర్‌సీని పాత పద్ధతితోనే నిర్వహించాలని కేంద్రాన్ని జగనన్న కోరారని హాఫీజ్‌ఖాన్ గుర్తు చేశారు. నంద్యాలలో సలాం ఆత్మహత్య నేపథ్యంలో పోలీసులపై చర్యలు తీసుకున్నారన్నారు. రెండు కళ్ల సిద్ధాంతంతో రాష్ట్ర విభజనకు మొదట లేఖ ఇచ్చిన చంద్రబాబుకు తెలంగాణలోనే నామరూపాలు లేకుండా చేశారని, రాష్ట్ర విభజన తరువాత శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలుకు రాజధాని లేదా హైకోర్టును చంద్రబాబు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కర్నూలుకు ఏమి చేశారని ప్రశ్నించడం కాదని, రూ.400 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు రూ.200 కోట్ల ప్రతిపాదనలు పంపిన విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి పక్కాగా అమలు చేయకపోవడంతోనే యువగళంలో పెయిడ్ ఆర్టిస్టులను తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కోవిడ్ సమయంలో తండ్రీకొడుకులు హైదరాబాదులో తలదాచుకుంటే కర్నూలు నగరంలో వీధి వీధిన తిరిగి ప్రజలకు ధైర్యం చెప్పడంతో పాటు వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేయడంతోనే కోవిడ్ వారియర్‌గా తనకు అవార్డు వచ్చిందన్నారు. ఇప్పటికేనా లోకేష్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు.



సీఎంను కలిసిన మేయర్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో కలిసి జిల్లా రాజకీయ పరిస్థితులను వివరించినట్లు మేయర్ తెలిపారు. అలాగే కర్నూలు నగరంలోని ప్రధాన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు మేయర్ చెప్పారు.

కర్నూలు రెడ్‌క్రాస్‌కు గవర్నర్ ప్రశంస



గవర్నర్ నజీర్ అహ్మద్‌తో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని రాజ్‌భవన్‌లో రెడ్‌క్రాస్ ప్రతినిధులను రాష్ట్ర గవర్నర్ నజీర్ అహ్మద్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన కర్నూలు జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను తెలుసుకుని జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డిని ప్రశంసించారు. రాష్ట్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చిన 11 మందికి గవర్నర్ చేతుల మీదుగా బంగారుపతకాలు ప్రదానం చేశారు. ఈ సంస్థల్లో హైదరాబాద్‌కు చెందిన విర్చోడా ఫౌండేషన్ వారు రూ.35 లక్షలతో సింగిల్ డోనార్ ప్లేట్‌లెట్ మిషన్‌ను ఇటీవల అందజేశారు.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం



అనాథాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

కర్నూలు(హాస్పిటల్): వరల్డ్ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని సోమవారం కర్నూలులో ఘనంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కర్నూలు జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో ఉదయం బ్లడ్‌బ్యాంక్‌లో రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాంట్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బుధవారపేటలో ఉన్న అనాథాశ్రమంలో చిన్నారులకు పండ్లు అందజేశారు. అనంతరం గుత్తిరోడ్డులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 26 మంది స్వచ్ఛందంగా రక్తం దానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ మహేంద్రకుమార్, ట్రెజరర్ రఘునాథ్‌రెడ్డి, ఎంసీ మెంబర్లు నరసింహ, మీనాక్షి, భీమశంకర్‌రెడ్డి, ఎం.జె.బాబురాజు, డాక్టర్ సాయిప్రణీత్‌కుమార్ రెడ్డి, టి.విజయకుమార్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ శ్రీనివాస రెడ్డి,డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

తలసీమియా పట్ల అవగాహన పెంచాలి



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): తలసీమియా వ్యాధి పట్ల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన పెంచాలని ఫెడరేషన్ ఆఫ్ గైనిక్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఫాగ్సి) కర్నూలు ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ, పీడియాట్రిక్స్ అసోసియే షన్ కర్నూలు అధ్యక్షులు డాక్టర్ విజయానందబాబు చెప్పారు.వరల్డ్ తలసీమియా డే సందర్భంగా సోమవా రం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసీమియా జన్యుపరమైన వ్యాధి అని, దంపతులు వివాహానికి ముందే అవసరమైన పరీక్షలు చేయించుకుంటే మేలన్నారు. ఇందులో తలసీమియా క్యారియర్స్‌గా ఇద్దరూ ఉంటే వారికి జన్మించే పిల్లలకూ వ్యాధి వస్తుందన్నారు. ఇలాంటి వారు పెళ్లి చేసుకోకూడదన్నారు. అలాగే మేనరికపు వివాహాల వల్ల కూడా తలసీమియా వస్తుందని, మేనరికపు వివాహాలు చేసుకోకూడదని తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్టులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ ఎ.సుధారాణి, డాక్టర్ సుజాత, డాక్టర్ ప్రియాంక, పీడియాట్రిక్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రత్నాకర్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

మైనార్టీలకు మేలు చేసింది వైఎస్సార్ కుటుంబమే

- టీడీపీ అధినేత చంద్రబాబు కరివేపాకులా వాడుకొని వదిలేశారు
- విలేకరుల సమావేశంలో మైనారిటీ సెల్ అధ్యక్షుడు యూనుస్



మాట్లాడుతున్న యూనుస్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలో మైనార్టీలకు మేలు చేసింది.. చేస్తున్నది వైఎస్సార్ కుటుంబమే అని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు యూనుస్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న టీడీపీ నేత లోకేష్ కర్నూలులో ఏర్పాటు చేసిన మైనార్టీ సమావేశం డ్రామా సెట్టింగ్‌లా ఉందన్నారు. రాజకీయ లబ్ధి కోసం మైనార్టీలకు ఏదో చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. ముస్లింలకు మేలు చేయడంలో వైఎస్సార్ కుటుంబం తరువాతే మిగితా వారన్నారు. నాడు మహానేత వైఎస్సార్ ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లు మైనార్టీల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చాయన్నారు. ఆయన తనయుడు సీఎం జగన్ తమకు ఎంతో చేస్తున్నారని, గత ఎన్నికల్లో ఐదు గురికి అసెంబ్లీ టికెట్లు ఇవ్వడంతో పాటు నలుగురికి ఎమ్మెల్సీ పదవులు, ఒకరికి డిప్యూటీ సీఎం, మరొకరికి మండలిలో డిప్యూటీ చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. ఇలా ఎన్నో పదవులు కట్టబెట్టి రాజకీయంగా ముస్లింలకు గుర్తింపు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. తమ అధినేత వైఎస్ జగన్ కడపలో సొంత మామ రవీంద్రారెడ్డిని కాదని మైనార్టీ అయిన అంజాద్ బాషాకు టికెట్ ఇచ్చారని, అదే టీడీపీ అధినేత చంద్రబాబు హిందూపురంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గనీని పక్కన పెట్టి ఆయన బావమరిది బాలకృష్ణకు ఇచ్చుకున్నారన్నారు. దీని బట్టి మైనారిటీలపై ఎవరికి ప్రేమ ఉందో స్పష్టమవుతుందని తెలిపారు. 2014 ఎన్నికల్లో గెలుపు కోసం చంద్రబాబు మైనార్టీలకు వివిధ హామీలు ఇచ్చి ఆ తర్వాత మోసం చేశారన్నారు. జనాభా దమాషా ప్రకారం ముస్లింలకు సీట్లు ఇస్తామని లోకేష్ చెప్పడం కాదని, ఆ సీట్లు ఎక్కడ ఇస్తున్నారో ముందుగా తేల్చాలన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలో ఎమ్మెల్యేలపై తప్పుడు ఆరోపణలు చేయడం లోకేష్‌కు తగదని, నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. రాష్ట్రమంతా తిరిగే బదులు ముందు పోటీ చేసే నియోజకవర్గం ఎంచుకుని అక్కడ చేయాలని, లేదంటే పాణ్యంలో కాటసానిపై పోటీ చేసి గెలవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చందు, సొహైల్ పాల్గొన్నారు.

యుఎస్ 7067 బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు స్వాధీనం



మంజునాథ ట్రేడర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): యుఎస్ 7067 బీటీ పత్తి విత్తన ప్యాకెట్ల వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కర్నూలు ఏడీఏ సాలురెడ్డి కల్లూరు టెక్నికల్ ఏఓ దస్తగిరిరెడ్డితో కలిసి కొత్త బాస్టాండు సమీపంలోని మంజునాథ ట్రేడర్‌లో తనిఖీలు నిర్వహించారు. యుఎస్ అగ్రి 7067 రకం బీటీ పత్తి విత్తన ప్యాకెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ డీలరు ఎమ్మిగనూరు, కర్నూలులోని డిస్ట్రిబ్యూటర్ల నుంచి యుఎస్ 7067 రకం బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు 900 తెచ్చుకొని బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మార్పీ రూ.853 ఉండగా రూ.1,150 ప్రకారం 716 ప్యాకెట్లు విక్రయించినట్లు తనిఖీల్లో ఏడీఏ గుర్తించారు. ఈ రకానికి డిమాండ్ ఉండటంతో జిల్లా వ్యాప్తంగా బ్లాక్‌లో అమ్మకాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే బిల్లులు మాత్రం రూ.853కే వేయడం గమనార్హం. మిగిలిన 184 ప్యాకెట్లు సీజ్ చేశారు. రాష్ట్రంలో కో-మార్కెటింగ్ లేకపోయినా ఆద్యా కంపెనీకి చెందిన కోమలి, స్వాతి రకాలను నిబంధనలకు విరుద్ధంగా 400 ప్యాకెట్లు తెచ్చుకొని ఇప్పటికే 40 ప్యాకెట్లు విక్రయించినట్లు గుర్తించారు. మిగిలిన 360 ప్యాకెట్లు సీజ్ చేశారు. రూ.4,64,032 విలువ కలిగిన మొత్తం 544 ప్యాకెట్లు సీజ్ చేసి, డీలరుపై 6ఏ కేసు నమోదు చేసి విచారణ జరపాలని కల్లూరు ఏఓ శ్రీనివాసరెడ్డిని ఆదేశించినట్లు ఏడీఏ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



స్థానికుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజా సమస్యలు పరిష్కారించేందుకే గడప గడపకు వస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 41వ వార్డు 107వ సచివాలయం వీకర్‌సెక్షన్ కాలనీ మారుతీనగర్ బోర్డు నుంచి స్థానిక కార్పొరేటర్ శ్వేతారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. రాష్ట్రంలో అవినీతి రహితంగా ప్రజారంజక పాలన అందిస్తున్నామన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేవిధంగా కృషి చేస్తున్నామన్నారు. కాలనీలో మహిళలు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరగా ప్రాధాన్యతా ప్రకారం పనులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అరుణ, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలచంద్రారెడ్డి, తిరుమలేష్ గౌడ్, వార్డులోని స్థానిక నాయకులు గంగులు, ఖాదర్‌బాషా, ప్రతాప్‌రెడ్డి, మాధవ స్వామి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి

కర్నూలు (టౌన్):యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని యోగ హాలులో వేసవి యోగ శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా సాధన చేసి జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో జాతీయ యోగా సంఘం సభ్యులు శ్రీధర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ నటరాజరావు, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, యోగా శిక్షకులు ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

సీఎం దృష్టిలో పడాలనే హాఫీజ్ ఖాన్ తాపత్రయం

కర్నూలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పడాలనే తాపత్రయంతోనే కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ యువగళం పాదయాత్రలో లోకేష్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ కర్నూలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. యువగళం పాదయాత్ర ప్రదేశంలో సోమవారం టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కర్నూలు నియోజకవర్గం ఇన్‌చార్జ్ టీజీ భరత్‌తో కలిసి సోమిశెట్టి విలేకరులతో మాట్లాడారు. హాఫీజ్‌ఖాన్ అవినీతిని లోకేష్ ఆధారాలతో బయటపెట్టారని, వాటిపై స్పందించకుండా యాత్రను అడ్డుకునేందుకు ప్రయత్నించడం తగదన్నారు.

ఐపీఎల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా రంగనాథ్

కర్నూలు(లీగల్): భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన న్యాయవాది కె.రంగనాథ్ ఎంపికయ్యారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన 11వ రాష్ట్ర మహాసభలలో నియామకం జరిగినట్లు ఐఏఎల్ నాయకులు తెలిపారు.

'శీతల గిడ్డంగితో మార్కెట్‌కు సంబంధం లేదు'

కర్నూలు(అగ్రికల్చర్):కర్నూలువ్యవసాయ మార్కెట్ యార్డులో అసంపూర్తిగా ఉండిపోయిన శీతల గిడ్డంగితో రాష్ట్ర ప్రభుత్వానికి, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఎలాంటి సంబంధం లేదని చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. 2017-18లో రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మార్కెట్ యార్డులో కేంద్ర ప్రభుత్వం శీతల గిడ్డంగి నిర్మాణం పనులు చేపట్టిందన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్‌డీఎఫ్)కు కేంద్రం నిధులు మంజూరు చేయకపోవడతో 2020-21 నుంచి పనులు ఆగిపోయాయన్నారు. ఈ విషయం తెలియని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత నిరాధారమైన అభియోగాలు మోపడం తగదన్నారు.

టీడీపీ నేతల ప్రోద్బలంతోనే తప్పుడు కేసులు



వాల్మీకి విగ్రహం వద్ద మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

- వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): తెలుగుదేశం నాయకుల ప్రోద్బలంతోనే వాల్మీకులపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం సుభాష్ చంద్రబోస్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రాలయం మండలం రచ్చుమర్రి బోయ మజ్జిగ చిన్న లచ్చప్పపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదును నిరసిస్తూ ఆ గ్రామస్తులతో కలిసి సోమవారం స్థానిక వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద సుభాష్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీని కలిసి పూర్తి స్థాయిలో విచారించాలని కోరామన్నారు. లచ్చప్పపై కేసును తొలగించకుంటే జిల్లా వ్యాప్తంగా వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మంత్రాలయం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మాలపల్లి లక్ష్మయ్య, ఆలూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంభీంనాయుడు, కప్పట్రాళ్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక వేదికలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్



జ్యోతి ప్రజ్వలనతో క్యాంప్‌ను ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: వేసవి సాధనా శిబిరాలు సృజనాత్మక వేదికలని, సెలవులను వృథా చేసుకోకుండా విద్యార్థులు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి సాధనా శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈనెల 16వ తేదీ వరకు అన్ని గ్రంథాలయాల్లో శిబిరాలు కొనసాగుతాయన్నారు. కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదవడం, స్పోకెన్ ఇంగ్లీష్, పెయింటింగ్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్ బొమ్మలు తయారు చేయడం తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు కేజీ గంగాధర్‌రెడ్డి, కురాడి చంద్రశేఖర కల్కూర, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, జేవీవీ సభ్యులు యాంగటేశ్వరప్ప మాట్లాడారు.

'స్పందన' సమస్యల పరిష్కారానికి కృషి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): స్పందన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనున్నట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించినలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్పందనలో మున్సిపల్ ఇంజినీరింగ్ ఎస్‌ఈ వేణుగోపాల్, అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

సమస్యలివే..

- సరైన మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు లక్ష్మీనగర్‌కు చెందిన శ్రీనివాసులు, విజయనగర కాలనీకి చెందిన మున్నా సాహెబ్ విన్నవించారు.
- అశోక్ నగర్ పాలకొట్టాల లైన్‌లో రోడ్డు ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయని, దీని వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయని అదే కాలనీకి చెందిన రంగస్వామి విన్నవించారు.
- తమ ప్లాటుకు ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, దీని వల్ల నిత్యం ఆందోళనకు గురవుతున్నామని ఇందిరమ్మ గృహాలకు చెందిన శైలజా బాయి విన్నవించారు.
- తమ కాలనీలో తాగునీటి, డ్రైనేజీ వ్యవస్థ లేదని తుంగభద్ర కాలనీకి చెందిన రవికాంత్ విన్నవించారు.
- తమ కాలనీలోని వీపీఎస్ ఫంక్షన్ హాలు సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీటి, దోమల సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని 29వ వార్డు విజయనగర్ కాలనీకి చెందిన రామిరెడ్డి కాలనీ వాసులు అర్జీ ఇచ్చారు.
- టిడ్కో ఇంటి కోసం ప్రభుత్వం నిర్ణయించిన రుణం చెల్లించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని, రుణం వాపస్ ఇవ్వాలని స్టాంటన్‌పురానికి చెందిన హాఫీజా అభ్యర్థించారు.